748) రామక్రియ

ప॥ తెలిసినవాడా గాను తెలియనివాడా గాను। యిల నొకమాట నీ కెత్తిచ్చితిగాని॥

చ॥ పుట్టించేవాడవు నీవే బుద్ధిచ్చేవాడవు నీవే। యెట్టున్నా నపరాధా లేవి మాకు।
అట్టూ నన్నవారముగా మనగా నీచిత్తమెట్టో। కిట్టి వొక మాట నుడిగితి నింతేకాని।

చ॥ మనసులోపల నీవే మరి వెలుపల నీవే। యెనసి అపరాధాలు యేవి మాకు।
నిను నౌగాదనలేము నీసరివారము గాము। అనవలసినమాట అంటి మింతేకాని।

చ॥ అంతరాత్మవును నీవే అన్నిటా గావగ నీవే। యెంతైనా నపరాధా లేవి మాకు।
వింత లేక శ్రీవేంకటవిభుడ నీబంట నింతే। వంతుకు నే నొకమాట వాకుచ్చితిగాని॥